నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మియాపూర్, ఫిబ్రవరి 15:11 కె.వి. ఏడోఫేస్ ఫీడర్ పరిధిలో విద్యుత్ మరమ్మతుల కారణంగా కోర్టు ఏరియా అంబేద్కర్ నగర్, కైతలాపూర్ ప్రాంతాల్లో ఆదివారం ఉదయం 11 నుంచి 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు బాలాజీ నగర్ ఏఈ భీమ లింగప్ప శనివారం తెలిపారు.

మున్సిపల్ కార్మికులకు ఇందిరమ్మ ఇండ్లనివ్వాలి

నిజాంపేట కమిషనర్ సాబీర్‌అలీకి వినతిపత్రం అందజేస్తున్న ఏఐటీయూసీ నాయకుడు శ్రీనివాస్

దుండిగల్ : కాంగ్రెస్ ప్రభుత్వం గ్యారంటీల అమలులో భాగంగా అర్హులైన మున్సిపల్ కార్మికులకు ఇందిరమ్మ ఇండ్లను కేటాయించాలని ఏఐటీయూసీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు పాలబిందల శ్రీనివాస్ అన్నారు. శనివారం నిజాంపేట మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ సాబేర్‌అలీని కలిసి వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ.. ఇటీవల చేపట్టిన ప్రజాపాలనలో ప్రకటించిన ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల లిస్టులో అవకతవకలు చోటు చేసుకున్నాయన్నారు. పేదలకు కాకుండా, భవంతుల్లో నివాసముంటున్నవారికి ఇండ్లు కేటాయిస్తున్నట్లు లిస్టులో పేరు రావడం అవకతవకలకు పరాకాష్టగా నిలుస్తుందన్నారు. ప్రభుత్వము నిజమైన లబ్ధిదారులకు న్యాయం చేయాలన్నారు. అదే సమయంలో మున్సిపల్ కార్మికులకు సకాలంలో జీతాలు అందేలా కమిషనర్ చర్యలు తీసుకోవాలని కోరారు.

బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు

కీసర : కీసరగుట్ట శ్రీ భవాని రామలింగేశ్వరస్వామి దేవస్థానంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈనెల 24 నుంచి మార్చి 1 వరకు నిర్వహించే కార్యక్రమాకు సంబంధించి కలెక్టర్ గౌతమ్ కుమార్ ఆధ్వర్యంలో రెండుమార్లు సమావేశాలు నిర్వహించారు. జాతరకు స్పెషల్ సరిపడ్డ బస్సులు నడుపుతామని సికింద్రాబాద్ ఆర్‌ఎం రాజశేఖర్ తెలిపారు.

సంత్ సేవాలాల్ చిరస్మరణీయుడు

సేవాలాల్ జయంతి కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే కృష్ణారావు

సంత్ సేవాలాల్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే వివేకానంద

మియాపూర్, ఫిబ్రవరి 15: సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి సందర్భంగా కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు నియోజకవర్గంలోని బాలాజీ నగర్ లో శనివారం సేవాలాల్ నగర్ వద్ద ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ .. గిరిజనుల ఆరాధ్యదైవం సంత్ సేవాలాల్ మహారాజ్ సమాజ శ్రేయస్సుకు చూపించిన మార్గం ఆదర్శనీయమని, తన పాటలు, రచనల ద్వారా ప్రజలను జాగృతం చేయడానికి , బంజారా జాతి ఔన్నత్యాన్ని ప్రపంచానికి చాటేలా అహింసా సిద్ధాంతానికి పునాదులు వేశారన్నారు. కార్యక్రమములో మాజీ కార్పొరేటర్లు పగడాల బాబు రావు, ప్రభాకర్ గౌడ్, ఎమ్మార్వో స్వామి, ఆర్డీవో, హరినాథ్ , శంకర్,కైలా, హరి, కల్యాణ్, బీమ్లా, రతన్, భవన్‌సింగ్ పాల్గొన్నారు.

ఘనంగా సంత్ జయంతి

మియాపూర్ : డివిజన్ పరిధిలోని నడిగడ్డ తండాలో నడిగడ్డ తండా గిరిజన సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన బంజారాల ఆరాధ్యదైవం సేవాలాల్ జయంతి ఉత్సవాల్లో నేషనల్ షెడ్యూల్ ట్రైబల్ కమిషన్ మెంబర్ జాతోతూ హుస్సేన్ నాయక్, నడిగడ్డ తండా గిరిజన సంక్షేమ సంఘం నాయకులతో కలసి ముఖ్యఅతిథిగా బల్దియా స్టాండింగ్ కౌన్సిల్ సభ్యులు మియాపూర్ కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ పాల్గొన్నారు. సేవాలాల్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నడిగడ్డ తండా గిరిజన సంక్షేమ సంఘం అధ్యక్షులు ఆల్వార్ స్వామి నాయక్, తిరుపతి నాయక్, సీతారాం, నాయక్, హనుమంతు నాయక్, దశరథ్ నాయక్, గోపి నాయక్, మోహన్ నాయక్, లక్పతి నాయక్, దేవా నాయక్, రెడ్యా నాయక్, యూత్ అధ్యక్షుడు దినేశ్ నాయక్, సచిన్, శివ, లక్ష్మణ్, సాయి, శంకర్ పాల్గొన్నారు.

జేఎన్‌టీయూలో జయంతి వేడుకలు

మియాపూర్ : జవహర్ లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయంలో స్టూడెంట్స్ ప్రొటెక్షన్ ఫోరం, జేఎన్‌టీయూ ప్రొటెక్షన్ ఫోర్స్ ఆధ్వర్యంలో జేఎన్‌టీయూ క్యాంటీన్ వద్ద (సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి సందర్భంగా క్యాంటీన్ నుంచి అన్ని డిపార్ట్ మెంట్ల మీదుగా శోభాయాత్ర నిర్వహించారు భోగ బందార్ కార్యక్రమం నిర్వహించి, అనంతరం అన్నదానం చేశారు. జేఎన్‌టీయూ ప్రొటెక్షన్ ఫోర్స్ నాయకులు రాహుల్ నాయక్ మాట్లాడుతూ.. సంత్ సేవాలాల్ కేవలం బంజారాలకే కాదు హిందూ ధర్మాన్ని ఆచరిస్తూ జీవిస్తున్న అందరికీ ఆదర్శప్రాయమని, బంజారాల ఆచార వ్యవహారాలను కాపాడుతూ సనాతన ధర్మాన్ని పరిరక్షించే బాధ్యతను నిర్వహించారన్నారు. కార్యక్రమంలో జేఎన్టీయూ టీచర్స్ అసోసియేషన్ జనరల్ సెక్రెటరీ సైదా నాయక్ , అధ్యాపకులు ఆంజనేయ ప్రసాద్, మెకానికల్ విభాగాధిపతి రాంజీగ, అడిషనల్ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ సమ్ములాల్ , కాంట్రాక్ట్ అధ్యాపకులు సురేశ్ నాయక్, బాలకృష్ణ, శివకుమార్, శివా రెడ్డి విద్యార్థులు సాగర్ నాయక్, దుర్గాప్రసాద్, నితిన్, గగన్ కౌశిక్, తనూజ్, చందు, జైరాం, విశాల్, సుజయ్, సంగెం సిరి, ప్రసన్న, లయ, వర్ష పాల్గొన్నారు.

సమానత్వం, సేవా భావనకు సంత్ సేవాలాల్ మహారాజ్ ప్రతీక

దుండిగల్ : సంత్ సేవాలాల్ సామాజిక సమానత్వం, సేవ భావనకు ప్రతీకగా నిలుస్తారని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద అన్నారు. సంత్ సేవాలాల్ జయంతి వేడుకలను పురస్కరించుకొని దుండిగల్ మున్సిపాలిటీ పరిధి, తండా -2 లో నిర్వహించిన వేడుకల్లో ఎమ్మెల్యే పాల్గొన్నారు. సేవాలాల్ మహారాజ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సేవాలాల్ జీవిత సందేశాలు సమాజానికి మార్గదర్శకంగా ఉంటాయని, బోధనలు ఆదివాసి గిరిజన సమాజ అభ్యున్నతికి తోడ్పాటు అందించడంతోపాటు సమానత్వానికి ప్రాధాన్యతనిస్తాయన్నారు. కార్యక్రమంలో దుండిగల్ మున్సిపాలిటీ మాజీ కౌన్సిలర్లు శంభీపూర్ కృష్ణ, కొర్ర శంకర్ నాయక్, మహేందర్ యాదవ్, సాయి యాదవ్, బీఆర్ఎస్ నాయకులు విష్ణువర్ధన్ రెడ్డి, మోహన్ నాయక్, ప్రవీణ్ నాయక్, ప్రేమ్ సింగ్ మహిళా నాయకురాలు పడాల మనోజ, శాంతాబాయి పాల్గొన్నారు.

అల్లాపూర్,ఫిబ్రవరి15: బంజారాల ఆరాధ్య దైవం సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకలు శనివారం అల్లాపూర్ డివిజన్ పరిధి పర్వత్ నగర్ కమిటీ హాల్లో ఘనంగా నిర్వహించారు. కార్పొరేటర్ సబీహా బేగం పాల్గొని సేవాలాల్ మహారాజ్ చిత్రపటానికి పూలమాల వేసి ఆయన సేవలను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో ఎస్టీ సెల్ అధ్యక్షుడు బద్రు నాయక్, జనరల్ సెక్రెటరీ భాస్కర్ నాయక్, జాహేద్ షరీఫ్ బాబా, బీఆర్ఎస్ రాజు, కొండం శ్రీనివాస్ రెడ్డి, శ్రీనివాస్ యాదవ్, బ్రహ్మ , మాధవాచారి,రామారావు, రామ్ చందర్, లింగం పాల్గొన్నారు.

జవహర్‌లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయంలో స్టూడెంట్స్ ప్రొటెక్షన్ ఫోరం, జేఎన్‌టీయూ ప్రొటెక్షన్ ఫోర్స్ ఆధ్వర్యంలో..

సేవాలాల్ మహారాజ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కార్పొరేటర్ సబీహా బేగం

ప్రజాసమస్యల పరిష్కారానికి కృషి

దుండిగల్ : ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఎమ్మెల్సీ, మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు శంభీపూర్ రాజును కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజలు శనివారం ఆయన నివాసంలో కలిశారు. తమ తమ ప్రాంతాల్లో నెలకొన్న సమస్యలను వివరించి పరిష్కరించాలని కోరారు. సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్సీ ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజలకు అందుబాటులో ఉంటూ కృషి చేస్తున్నామన్నారు. అధికారులతో మాట్లాడి త్వరలోనే సమస్యను పరిష్కరిస్తామన్నారు.

ట్రాఫిక్ భద్రతపై అవగాహన అవసరం

కొంపల్లిలో ట్రాఫిక్‌పై విద్యార్థులతో కలిసి అవగాహన ర్యాలీని ప్రారంభిస్తున్న మేడ్చల్ ట్రాఫిక్ ఏసీపీ వెంకట్ రెడ్డి

కుత్బుల్లాపూర్, ఫిబ్రవరి 15 : ట్రాఫిక్ పై యువత అవగాహన కలిగి ఉండాలని మేడ్చల్ ట్రాఫిక్ ఏసీపీ కె.వెంకట్ రెడ్డి సూచించారు. శనివారం హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసుల భాగస్వామ్యంతో కొంపల్లిలోని రయాన్ ఇంటర్నేషనల్ స్కూల్, పౌరులలో రోడ్డు భద్రత, బాధ్యతాయుతమైన ప్రయాణ పద్ధతులను ప్రోత్సహించడానికి ట్రాఫిక్ నిబంధనలపై 10 కే ర్యాలీ నిర్వహించారు. ట్రాఫిక్ నియమాలు, హెల్మెట్ వాడకం, పాదచారుల భద్రతపై ప్రభావవంతమైన సందేశాల ద్వారా అవగాహనను వ్యాప్తి చేయడం ఈ ర్యాలీ లక్ష్యమన్నారు. ఈ చొరవ సమగ్ర విద్య యొక్క దృక్పథానికి అనుగుణంగా బాధ్యత, క్రమశిక్షణ సంస్కృతిని పెంపొందించడంపై పాఠశాలల నిబద్ధతను ప్రతిబింబిస్తుందని ఏసీపీ అన్నారు. ప్రిన్సిపాల్ అనుసింగ్ మాట్లాడుతూ.. విద్యార్థులు రోడ్డు భద్రతపై అవగాహనను పెంపొందించడానికి మా ప్రయత్నం చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో అల్వాల్ ట్రాఫిక్ సీఐ నాగరాజు, విద్యార్థులు పాల్గొన్నారు.

అలరించిన కూచిపూడి ప్రదర్శన

కొండాపూర్ : వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా శనివారం మాదాపూర్‌లోని శిల్పారామంలో నృత్యకారుల సంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ప్రదర్శనలో వైఎస్. కల్యాణి శివాష్టకం, బాలగోపాలా తరంగం కూచిపూడి నడిచే రూపకంలో ప్రదర్శించారు. భువనేశ్వరి బరిక్ శిష్య బృందం తనన, నమశ్శివాయ, అన్నమాచార్య కీర్తన, వినాయక కౌతం, మూషిక వాహన, మం డూక శబ్దం, రామదాసు కీర్తన అంశాలను కూచిపూడి రూపకంలో అవని, దీపాలి, అక్షర, రసజ్ఞ, నిత్యశ్రీ, దీక్షిక, శ్లోక, సహన, ఇషాన్వి, శ్రీహిత, తాన్విక, అక్షయలు ప్రదర్శించారు నాట్య గురువులు డా.వనజ ఉదయ్, డా. కిరణ్మయి బోనాల కళాకారులను అభినందించారు.

కుటుంబ కలహాలు.. వ్యక్తి ఆత్మహత్య

దుండిగల్, ఫిబ్రవరి 15 : కుటుంబ తగాదాల నేపథ్యంలో భార్య అలిగి ఇంట్లో నుంచి వెళ్లిపోవడంతో మనస్తాపానికి గురైన ఓ యువకుడు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన దుండిగల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకున్నది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వికారాబాద్ జిల్లా తాండూర్‌లోని మల్కాపూర్ గడికి చెందిన నీలేశ్(24), పూజ దంపతులు. వీరికి ఐదేండ్ల క్రితం వివాహమైంది. బతుకుదెరువు కోసం నగరానికి వచ్చి, దుండిగల్ మున్సిపాలిటీ పరిధి, డి.పోచంపల్లిలోని దుండిగల్ పీఎస్ వెనకాల బస్తీలో నివాసం ఉంటున్నారు. అతడు అమెజాన్ ఈ కామర్స్‌లో డెలివరీ బాయ్‌గా పని చేస్తుండగా, పూజ కొంపల్లిలోని ఎలక్ట్రికల్ షాప్‌లో పనిచేస్తున్నది. ఈ నేపథ్యంలో దంపతుల మధ్య కొంతకాలంగా విభేదాలు తలెత్తాయి. దీంతో రెండు రోజుల క్రితం పూజ తన భర్తకు చెప్పకుండా వెళ్లి పోయింది. మనస్తాపానికి గురైన నీలేశ్ శనివారం మధ్యాహ్నం తను నివాసముంటున్న ఇంట్లో ఫ్యాన్ కు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఇరుగుపొరుగు వారి సమాచారంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పోస్టుమార్టంనిమిత్తం గాంధీ వైద్యశాల తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

నీలేశ్ (ఫైల్)

23న రాష్ట్రస్థాయి బ్రాహ్మణ వివాహ పరిచయ వేదిక

మియాపూర్ , ఫిబ్రవరి 15 : గాయత్రి బ్రాహ్మణ అసోసియేషన్ మియాపూర్ ఆధ్వర్యంలో 14 వ రాష్ట్రస్థాయి వధూవరుల పరిచయ వేదిక మియాపూర్ శ్రీ షిర్డి సాయి బాబా దేవాలయం కమ్యూనిటీ హాల్‌లో, జనప్రియ అపార్టుమెంట్స్ లో ఈ నెల 23 (ఆదివారం) నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ ప్రతినిధి మూర్తి శనివారం తెలిపారు.ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు వేదిక నిర్వహణ కొనసాగుతుందన్నారు. రిజిస్ట్రేషన్ ఆఖరు తేది 18 అని, ఈ సదావకాశాన్ని వినియోగించుకోవాలనికోరారు. 23 రోజున స్పాట్ రిజిస్ట్రేషన్ అవకాశం ఉంటుందని తెలిపారు .

రిజిస్ట్రేషన్ ఇతర వివరాల కోసంఎం.యస్. బి. ఎం.సోమయాజులు 9948321233, పి. ఎస్. శంకర 9346971918, పి. ఆర్. కె .మూర్తి 7981413159,9849057369 లను సంప్రదించాలని మూర్తి సూచించారు.

చిన్న పరిశ్రమలను ట్రేడ్ లైసెన్స్‌ల నుంచి మినహాయించాలి

మియాపూర్, ఫిబ్రవరి 15: కూకట్పల్లి ప్రశాంతినగర్ పారిశ్రామికవాడలో చిన్న పరిశ్రమలకు ట్రేడ్ లైసెన్సుల నుంచి మినహాయింపు ఇవ్వాలని నిర్వాహకులు కోరుతున్నారు. ప్రభుత్వంపై ఆధారపడకుండా సొంత పెట్టుబడులతో నిర్వహిస్తూ ఉపాధి కల్పిస్తున్నామని అభ్యర్థిస్తున్నారు. జీహెచ్ఎంసీ ద్వారా ట్రేడ్ లైసెన్సులు తీసుకోవాలని నోటీసులను జారీ చేసిన నేపథ్యంలో సదరు వ్యాపారులు ప్రభుత్వాన్ని అభ్యర్థిస్తున్నారు. 30 ఏండ్లుగా వ్యయప్రయాసలకు ఓర్చి వందలాది మందికి ఉపాధి కల్పిస్తున్నామన్నారు.

భూములను కాపాడాలి

జగద్గిరిగుట్ట ఫిబ్రవరి 15:ప్రభుత్వ భూములు కాపాడడంతోపాటు.. ఇల్లు లేని పేదలకు ప్రభుత్వం అండగా నిలవాలని సిపిఐ నేతలు కోరారు. రంగారెడ్డి నగర్ డివిజన్ గాంధీ నగర్ లోని ఏఐటీయూసీ కార్యాలయంలో శనివారం సమావేశం జరిపారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ఈనెల 20న జరిపే జిల్లా స్థాయి సమావేశానికి ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు హాజరవుతారని తెలిపారు. పార్టీ కార్యచరణతోపాటు కుత్బుల్లాపూర్ నియోజక వర్గం లోని పరికి చెరువు, స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ భూములు సందర్శిస్తారు. గుడిసెలు వేసుకున్న పేదలకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం సహకరించకపోతే వారిని సమీకరించి భారీ పాదయాత్ర చేపడతామన్నారు. ఈనెల 20న జరగనున్న సమావేశాలు పర్యటనలను విజయవంతం చేయాలని కోరారుకార్యక్రమంలో సిపిఐ ప్రతినిధులు హరినాథ్ రావు నరసయ్య ఉమా మహేష్ పూర్ణచందర్, యాకూబ్, కుమార్ పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలు సీజ్

కొండాపూర్, ఫిబ్రవరి 15 : అనుమతులు లేకుండా విచ్చలవిడిగా అంతస్తులపై అంతస్తుల నిర్మాణాలు చేసిన పలు భవనాలను శనివారం శేర్లింగంపల్లి సర్కిల్ -20 టౌన్ ప్లానింగ్ అధికారులు సీజ్ చేశారు. శేర్లింగంపల్లి జోనల్ కమిషనర్ ఉపేందర్ రెడ్డి ఆదేశాల మేరకు టౌన్ ప్లానింగ్ ఏసీపీ వెంకటరమణ ఆధ్వర్యంలో కొండాపూర్ డివిజన్ పరిధిలోని మార్తాండ నగర్ లో కొనసాగుతున్న అక్రమ నిర్మాణాలను టౌన్ ప్లానింగ్ సెక్షన్ ఆఫీసర్ జీషన్ ఇబ్బందితో కలిసి నాలుగు భవనాలను సీజ్ చేశారు. కాలనీలో మొత్తం 36 భవనాలను గుర్తించినట్లు, ఇప్పటికే నోటీసులు సైతం అందజేసినట్లు అధికారులు తెలిపారు. అనుమతులు లేకుండా ఇష్టానుసారంగా అక్రమ నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు తప్పవని సందర్భంగా హెచ్చరించారు.

నేటి నుంచి నిజాంపేట కార్పొరేషన్‌లో కులగణన

దుండిగల్, ఫిబ్రవరి 15: ప్రభుత్వం గతంలో చేపట్టిన ఇంటింటి కుల గణన కార్యక్రమంలో పాల్గొనాని కుటుంబాల కోసం ఈ నెల 16 (ఆదివారం)నుంచి 28వ వరకు మరోసారి అవకాశం కల్పిస్తున్నట్లు నిజాంపేట మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ సాబేర్ ఆలీ ఒక ప్రకటనలో తెలిపారు. కులగణనలో తమ వివరాలు నమోదు చేసుకునుటకుగాను 040-21111111 టోల్ ఫ్రీ నంబర్ కు కాల్ చేసి నమోదు చేసుకోవచ్చన్నారు. అదేవిధంగా ఆన్లైన్ ద్వారా https://seeepcsurvey. cgg. gov. in అనే లింకును ఓపెన్ చేసి తమ వివరాలను నమోదు చేయించుకోవడంతో పాటు అట్టి ప్రతిని మున్సిపల్ కార్యాలయంలో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు సమర్పించాలన్నారు. లేదా ప్రతిరోజు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు మున్సిపల్ కార్యాలయం వద్దకు విచ్చేసి అక్కడ లభించే దరఖాస్తు ఫారంలో తమ వివరాలను నమోదు చేసి అధికారులకు అందజేయాల్సి ఉంటుందన్నారు. ఈ అవకాశాన్ని మున్సిపల్ కార్పొరేషన్ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

దూరవిద్య డిగ్రీ ఫలితాల రీవాల్యుయేషన్‌కు దరఖాస్తుల ఆహ్వానం

ఉస్మానియా యూనివర్సిటీ: ఉస్మానియా యూనివర్సిటీ దూర విద్య కేంద్రమైన ప్రొఫెసర్ జి.రాంరెడ్డి సెంటర్ ఫర్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్ (పీజీఆర్ఆర్ సీడీఈ) ద్వారా అందించే అన్ని డిగ్రీ కోర్సుల పరీక్షా ఫలితాల రీవాల్యుయేషన్ కు దరఖాస్తులను స్వీకరించనున్నట్లు అధికారులు తెలిపారు. ఈ రీవాల్యుయేషన్ కు ఒక్కో పేపర్కు రూ.500 చొప్పున చెల్లించి ఈ నెల 19వ తేదీలోగా టీఎస్ ఆన్‌లైన్ కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. రూ.200 అపరాధ రుసుముతో 21వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. జవాబు పత్రాల నకలు పొందగోరువారు ఒక్కో పేపర్ కు రూ. 1000 చొప్పున చెల్లించి 21వ తేదీ వరకు తమ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. ఇతర వివరాలకు ఓయూ వెబ్సైట్లో చూసుకోవచ్చని సూచించారు.

ఉద్దెమర్రి శివాలయ అభివృద్ధికి టెండర్లు

శామీర్‌పేట, ఫిబ్రవరి 15 : ఉద్దెమర్రి శ్రీ విష్ణు శివాలయ అభివృద్ధి పనులకు టెండర్లు కోరుతున్నట్లు దేవాలయ చైర్‌పర్సన్ ఆడెపు ఉమామహేశ్వరి, ధర్మకర్తలు బూడిద రవీందర్‌గౌడ్, సామ ల రాజిరెడ్డి, బురిగళ్ల రమేశ్ తెలిపారు. ఆలయ అభివృద్ధికి రూ.50 లక్షల మంజూరైన విషయం తెలిపారు. పనులు చేపట్టేందుకు దేవాదాయ ధర్మాదాయ శాఖ టెండర్ ప్రకటన జారీ చేసిందన్నారు. ఈనెల 28లోపు టెండర్ ప్రకటన పూర్తి అనంతర శివాలయంలో రాజగోపురం, నీరాలి మండపం,స్వామివారి పుష్కరిణి, పుష్కరఘాట్ అభివృద్ధి పనులు ప్రారంభమవుతాయన్నారు.

ఉప్పల్ అభివృద్ధికి నిధులివ్వండి

రామంతాపూర్, ఫిబ్రవరి 15: ఉప్పల్ నియోజకవర్గ అభివృద్ధికి నిధులు కేటాయించాలని కోరుతూ శనివారం ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ఎల్బీనగర్ జోనల్ కమిషనర్ హేమంత్ కేశశ్ పాటిల్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. ప్రధాన రోడ్డు, ఓపెన్ జిమ్, కమ్యూనిటీ హాల్ కి నిధులు ఇవ్వాలన్నారు. పలు కాలనీలో భూగర్భ డ్రైనేజీలు, కొత్త రోడ్లు నిర్మించాలని కమిషనర్ దృష్టికి తెచ్చారు. కార్యక్రమంలో మల్లాపూర్ డివిజన్ కార్పొరేటర్ పన్నాల దేవేందర్ రెడ్డి. బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు సాయి జన శేఖర్, బనాల ప్రవీణ్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

సైఫాబాద్ పీజీ కళాశాల అకాడమిక్ కో - ఆర్డినేటర్‌గా డాక్టర్ సునీత మంజరి

ఉస్మానియా యూనివర్సిటీ: సైఫాబాద్ పీజీ కళాశాల అకాడమిక్ కోఆర్డినేటర్ గా డాక్టర్ సునీత మంజరి నియమితులయ్యారు. ఈ మేరకు ఆమెకు ఓయూ వీసీ ప్రొఫెసర్ కుమార్ నియామక పత్రాన్ని అందజేశారు. ఆమె కెమిస్ట్రీ విభాగానికి చెందినవారు. ఈ సందర్భంగా ఆమెను పలువురు అధికారులు, అధ్యాపకులు అభినందించారు.

ఓయూ వీసీ నుంచి నియామక పత్రం అందుకుంటున్న డాక్టర్ సునీత మంజరి

శ్రీదుర్గామల్లేశ్వరి ఆలయ వార్షికోత్సవం

అల్లాపూర్ :అల్లాపూర్ డివిజన్ పరిధిలోని పర్వత్ నగర్ శ్రీ దుర్గా మల్లేశ్వరి ఆలయ 23వ వార్షికోత్సవాలు ఆలయ కమిటీ చైర్మన్ సుంకన్న ఆధ్వర్యంలో నిర్వహించారు. అమ్మవారి కల్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని అమ్మవారికి పూజలు చేశారు. అనంతరం అన్నప్రసాద వితరణ చేశారు.

గురు దత్తాత్రేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠ

మియాపూర్,ఫిబ్రవరి 15 : కూకట్ పల్లి నియోజకవర్గం భరత్ నగర్ కాలనీ లోని త్రిమూర్తి స్వరూప గురు దత్తాత్రేయ స్వామి వారి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం శనివా రం జరిగింది. కూకట్‌పల్లి నియోజకవర్గ జనసేన కంటెస్టెడ్ ఎమ్మెల్యే ముమ్మారెడ్డి ప్రేమకుమార్ పాల్గొని పూజలు చేశారు. కార్యక్రమంలో కూకట్ పల్లి నియోజకవర్గ జనసేన నాయకులు ఎన్ .నాగేంద్ర బాబు,కొల్లా శంకర్ ,పండుగ సూర్య, పోలేబోయిన శ్రీనివాస్ , దుర్గా ప్రసాద్ ,రాము ,సుదర్శన్ ,మురళీ ,ప్రసాద్ ,కిరణ్,జనార్ధన్,భీమరాజు పాల్గొన్నారు.

అలరించిన సంకీర్తనలు

మాదాపూర్ : కళాకారులు శ్రీసిద్ధి వేంకటేశ్వరస్వామి సంకీర్తనలతో ఆకట్టుకున్నారు. అన్నమాచార్య భావన వాహినిలో శనివారం అన్నమయ్యపురం విద్యార్థులచే కార్యక్రమాన్ని నిర్వహించారు. హరిప్రియ పొడగంటిమయ్యా మిమ్ము, ఆకటి వేళల, వెంకటాచల నిలయం, హరి మన తుమి, ఇంత చక్కని పెండ్లికొడుకు, గోవిందాశ్రిత, అది వో అల్లది వో, భో శంభో ఆలపించారు. మద్దాలి, పి. నమ్రత, శ్రీశైవి కే. సుదర్శన్ కే. నీవన్. వై, జైవిక్. వై, సంతోష్ కుమార్ నారాయణం సంయుక్తంగా బ్రహ్మమొక్కటే, తిరు తిరు జవరాల, అన్ని మంత్రములు ఇందే అన్నమయ్య సంకీర్తనలతో మెప్పించారు. కీబోర్డ్ కరుణాకర్, తబలా గజేంద్ర వాయిద్య సహకారం అందించారు. పద్మశ్రీ, డా. శోభారాజు కళాకారులను సన్మానించి జ్ఞాపికలను అందజేశారు. శ్రీ సిద్ధి వెంకటేశ్వర స్వామి వారికి పూజలు చేసి ప్రసాదాల వితరణ చేశారు.

పటేల్‌కుంట పార్క్ సుందరీ కరణ

మియాపూర్ ఫిబ్రవరి 15:వివేకానంద నగర్ డివిజన్ పరిధిలోని పటేల్‌కుంట పార్కును పూర్తిస్థాయి మౌలిక వసతులతో సుందరీకరిస్తున్నట్లు కార్పొరేటర్ మాధవరం రోజాదేవి పేర్కొన్నారు. పచ్చదనం వాకింగ్ ట్రాక్ సహా ఆహ్లాదకరమైన వాతావరణన్ని అభివృద్ధి చేస్తామన్నారు. శనివారం పార్కులో నూతనంగా వేస్తున్న బోరు నిర్మాణ పనులను కార్పొరేటర్ పరిశీలించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావు, పడిగేశ్వరరావు, చెన్నారావు ,రవీందర్ రావు పాల్గొన్నారు.

IN THE COURT OF THE HON'BLE PRL. SENIOR CIVIL JUDGE - cum - CHIEF JUDICIAL MAGISTRATE: AT: MEDCHAL
O.S.No.49 OF 2025
Between:
Smt. Dorbala Rajitha & others ...Plaintiffs
AND
The Tahslidar, Quthbullapur Mandal & All Concerned ...Defendants
To
All Concerned .... Defendant No.2
NOTICE
Whereas the Plaintiffs above named have filed the above suit praying the said Hon'ble Court to declare them as Class - I Legal Heirs of the deceased Sri Dorbala Kiran Kumar, etc., and for that reason, you are hereby called upon to be present in person or through your counsel duly instructed on the 20th day of March, 2025, at 10-30 a.m. before the said Court, failing which, you will be exparte and the matter will be decided on merits.
//BY ORDER OF THE COURT//
K. SHANKAR & G. RAM CHANDER.
ADVOCATES,
Off: at H.No.#07-25-004,
Opp: Ved Vihar, Agra Sweet House Lane,
Subhashnagar Road, Trimulgherry,
Secunderabad Cantonment - 500015
ADVOCATES FOR PLAINTIFFS